క్లుప్తంగా

భవనాన్ని మంజూరు చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామానికి పొదుపు మహిళా సంఘం సమావేశ భవనాన్ని మంజూరు చేయాలని జెడ్పీటీసీ వెంకటేశ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఎంపీపీ నిర్మలతో కలిసి జెడ్పీటీసీ వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 35 పొదుపు సంఘాల్లో సుమారుగా 500కు పైగా మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. ఆర్థికాభివృద్ధి, బ్యాంక్ లావాదేవీలు, మహిళా సంక్షేమం తదితర అంశాలపై ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు శ్రీశైలం గౌడ్, శేఖర్, శ్రీకాంత్, కృష్ణ, కిరణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో అభిషేకం



కృష్ణా జలాలతో దుర్గాదేవికి అభిషేకం చేస్తున్న సర్పంచ్

కడ్తాల్: చరికొండ సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో స్థానిక దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి కృష్ణా జలాలతో అభిషేకం చేశారు. పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు సస్యశ్యామలమవుతాయని సర్పంచ్ తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ శ్రీశైలం కోరారు. శుక్రవారం దేవుని పడకల్‌లో ఆవేర్ సంస్థల చైర్మన్ మాధవన్‌జీ, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సకాలంలో మందులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక, తాత్కాలిక వ్యాధులతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ రఘు, ఆవేర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మంచాల: బదిలీల్లో అన్యాయం జరుగుతోందని వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు శుక్రవారం మంచాల మండల కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవో ద్వారా ఇతర జిల్లాల నుంచి చాలా మంది ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చారని తెలిపారు. దీంతో స్థానికులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పుట్టి పెరిగిన ఉపాధ్యాయులను బలవంతంగా ఇతర జిల్లాలకు పంపించడం దారుణమన్నారు. వాస్తవాలను పరిశీలించి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పీఆర్‌టీయూ జిల్లా నాయకులు జమీర్, జావేద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

గణేశ్ మండపాల్లో పూజలు జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పలు చోట్ల విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. పలు చోట్ల నేతలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు ఘనంగా సన్మానించారు. పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



ఆమనగల్లు: హిందుస్థాన్ ఉత్సవ కమిటీ ప్రతిష్ఠించిన గణనాథుడు



ఇబ్రహీంపట్నం: శ్రీరామ్‌నగర్ కాలనీ రాంరెడ్డి వీధిలో కొలువుదీరిన గణనాథుడు



కడ్తాల్: మైసిగండిలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ముగ్గులపోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేత



తుర్కయంజాల్: శ్రీరామ్‌నగర్ కాలనీలో పూజలందుకుంటున్న వినాయకుడు



తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో ప్రజాపతినిధులు

అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. అంగన్‌వాడీల సమ్మెకు హస్తం పార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను ఐసీడీఎస్ అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అంగన్‌వాడీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, నాయకులు లక్ష్మయ్య, రాజేశ్, ఇమ్రాన్‌బాబా అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నారు.



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు పలికిన కాంగ్రెస్ నాయకులు

బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకే 'దళితబంధు'

కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్



కడ్తాల్: దళితబంధు పథకం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకే బంధువుగా మారిందని కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతేడాది గ్రామానికి ఒకటి, రెండు దళితబంధు యూనిట్లు మంజూరు చేశారని, ఇటీవల యూనిట్ల సంఖ్య పెంచినప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చెప్పిన వారినే పథకానికి ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించి, గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

ఆశ వర్కర్ల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు

యాచారం: ఆశ వర్కర్లు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సమ్మెకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ యాచారం సీహెచ్‌సీ వైద్యురాలు ప్రియాంక, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నెలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు పీఆర్సీ ఏరియర్స్, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని, 32 రకాల రిజిస్టర్లు ప్రింట్ చేసి ఇవ్వాలని, ప్రసూతి సెలవులపైన వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు సమ్మెకు దిగుతున్నారు. ఆశ వర్కర్లకు మద్దతుగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశ కార్యకర్తలు ఎల్మినేడు మెడికల్ అధికారి నాగయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం రాములు మాట్లాడుతూ ఆశాల పారితోషకాన్ని రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలన్నారు. 18 ఏళ్లుగా రాష్ట్రంలో పని చేస్తున్నారని, ఇప్పటికీ ఉద్యోగ భద్రత కరువైందన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మరియమ్మ, కవిత, భాగ్య, అమృత, రాణి, అనిత, సరిత పాల్గొన్నారు.

82వ రోజుకు చేరిన దీక్షలు



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ నాయకుడు రేణురెడ్డి డిమాండ్ చేశారు. గట్టుఇప్పలపల్లిని మండలముగా ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 82వ రోజుకు చేరుకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, దామోదర్, రేణురెడ్డి, శేఖర్, పవన్, చంద్రయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఆదుకోవాలి

యాచారం: అభివృద్ధిలో వెనకబడిన రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం యాచారం మండల అధ్యక్షుడు దశరథ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం రజక సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని, 60 ఏళ్ల నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, వృత్తిపై ఆధారపడే వారికి బ్యాంకుల్లో రుణాలు ఇప్పించాలని కోరారు. ఈ నెల 26న యాచారం మండల కేంద్రంలో తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నరేశ్, యాదయ్య, వెంకటేశ్, బచ్చయ్య, లక్ష్మయ్య, అంజయ్య, శివశంకర్, మధుసూదన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మంజుల

యాచారం: కాంగ్రెస్ పార్టీ యాచారం మండల మహిళా అధ్యక్షురాలిగా తాడిపర్తి గ్రామానికి చెందిన మంజులను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంజులకు అందజేశారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. మహిళలు అండగా ఉంటే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, రమావత్ జ్యోతినాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ జ్యోతినాయక్ తదితరులు పాల్గొన్నారు.



మంజులకు నియామకపత్రాన్ని అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఓబీసీ సెల్ చైర్మన్ నియామకం

మంచాల: కాంగ్రెస్ పార్టీ మంచాల మండల ఓబీసీ సెల్ చైర్మన్‌గా లింగంగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎంపికకు సంబంధించిన నియామకపత్రాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేశారు. అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగయ్య, దాసు, ఓబీసీ సెల్ నియోజకవర్గ చైర్మన్ పాండు, ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు మల్లిక, మండల అధ్యక్షురాలు శిల్ప తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ నూతన కమిటీ నియమించే అంశంపై తనకు, స్థానికులకు సమాచారం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: గ్రామాల్లో పేదలు సాగుచేసుకుంటున్న లావణి భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని కాగజ్‌ఘట్, ఆరుట్ల గ్రామాలకు చెందిన రైతులు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. పాసు పుస్తకాలు లేక పోవడంతో రైతుబంధు రావడం లేదని వాపోయారు. కొందరు రైతులు చనిపోయారని వారికి భూమికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో రైతు బీమా కూడా రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన కలెక్టర్ హరీశ్‌ను కలిసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, రాము, జంగయ్య, జంగయ్య వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, కలెక్టర్‌ను కలిసి రైతులు

ఆలయంలో భక్త గానలహరి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ భవాని ఆలయంలో గురువారం రాత్రి భక్త గాన లహరి నిర్వహించారు. వేద పండితులు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గిన్నిస్ రికార్డ్ విజేత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణం, కళాబృందంచే గాన లహరి కార్యక్రమాన్ని నిర్వహించారు. బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించింది. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. భక్తితో ముక్తి లభించనుందని, ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడుస్తున్నారని తెలిపారు. సుబ్రహ్మణ్యం కళా బృందానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాసామూర్తి అతిథులను శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో వేద పండితులు యాదగిరి నరసింహశాస్త్రి, ఎంపీటీసీ అంబాజి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవి కుమార్, విష్ణు, విష్ణువర్ధన్, అజీజ్, వెంకట్‌రెడ్డి, చెన్నయ్య, గోపాలకృష్ణ, నరేందర్, విజయ్, భక్తులు పాల్గొన్నారు.



అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తున్న కళాబృందం

చదువుకు పేదరికం అడ్డుకాదు



ఆర్థికసాయం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన రమేశ్ అనే విద్యార్థి ఉన్నత చదువుల కోసం జర్మనీ దేశం వెళుతున్న క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వలన రాఘవేందర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు కలిశారు. దీంతో విద్యార్థి ఉన్నత చదువుల కోసం ఆయన రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపేయకూడదని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాంనుంతల మాజీ సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నిమజ్జనానికి క్రేన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతను సమీక్షించేందుకు పోలీసు సిబ్బంది నిత్యం గస్తీ కాస్తున్నారు. మున్సిపల్ సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. సుమారు 2 వేల వరకు వినాయకుడి విగ్రహాల నిమజ్జనం జరుగవచ్చని అధికారులు భావిస్తున్నారు. భక్తులు అధికారులకు సహకరించి, సజావుగా నిమజ్జన ప్రక్రియ పూర్తి అయ్యేలా చూడాలని కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ తెలిపారు.



మాసబ్ చెరువులో కొనసాగుతున్న గణనాథుల నిమజ్జనం

ఆరోగ్యమే మహాభాగ్యం



ప్రతిజ్ఞలో పాల్గొన్న ఎంపీపీ సుకన్య తదితరులు

ఎంపీపీ సుకన్య

యాచారం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తా చెదారం ఇంటి పరిసరాల్లో నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ సుకన్య సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాచారం గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో దుర్వాసన, దోమల బెడద నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. డ్రైనేజీ కాల్వలు శుభ్రంగా ఉంచుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, పాఠశాల హెచ్‌ఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో...

కడ్తాల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని జెడ్పీటీసీ దశరథ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ మేరకు మహిళా సంఘాల సభ్యులతో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఏపీఎం రాజేశ్వరి, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ గోపాల్, వీరయ్య, బాలకృష్ణ, చత్రునాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


ఇబ్రహీంపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛత లీగ్ 2.0పై ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణానికి హాని కల్గించి కాలుష్యాన్ని వెదజల్లే వాటిపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ పాటుపడాలని, ఇది అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల చేత స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శివగంగలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి